సాక్షి బాపట్ల

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



శివపార్వతుల కల్యాణం

సత్తెనపల్లి: మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీ ఫిరోజీ రుషింద్రుల మఠంలో వేంచేసి ఉన్న శ్రీ వేద గాయత్రి దేవి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం జరిగింది.



కొరియా ప్రతినిధుల సమావేశం

నరసరావుపేట: వినుకొండ మండలం వెంకుపాలెం వద్ద లెదర్ పార్కు ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుతో కొరియా ప్రతినిధులు బుధవారం సమావేశమయ్యారు.



నిత్య కల్యాణ మహోత్సవాలు

బాపట్ల: పట్టణంలోని త్యాగరాయనగర్‌లో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణ మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

జాతీయ అథ్లెటిక్స్‌కు ధర్మవరం పీఈటీ ఎంపిక



అద్దంకి రూరల్: అనంతపురంలో ఈ నెల 8,9,10 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 43వ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో అద్దంకి మండలం ధర్మవరం ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు యు.మధుబాబు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 400 మీటర్ల రిలేలో గోల్డ్ మెడల్, 1600 మీటర్ల రిలేలో సిల్వర్‌మెడల్, 1500 పరుగుపందెంలో కాంస్య మెడల్ సాధించారు. మార్చి 4 నుంచి 9 వరకు బెంగళూరులో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన మధుబాబును జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ యు.శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

శ్రీశైలం దేవస్థానానికి లక్ష విస్తరాకులు



చీరాల అర్బన్: పట్టణానికి చెందిన శ్రీ భ్రమరాంబిక సేవా సమితి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రీశైలం దేవస్థానానికి లక్ష విస్తరాకులను అందించారు. సమితి ఆధ్వర్యంలోనే తయారు చేయించి ప్రత్యేక వాహనంలో శ్రీశైలం పంపించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా శ్రీశైల దేవస్థానానికి అన్నదానం నిమిత్తం లక్ష విస్తరాలను చీరాల నుంచి పంపిస్తున్నారు. విస్తరాకులను సమితి ప్రతినిధులు శ్రీశైల దేవస్థాన అధికారులకు అందించారు. అలానే పట్టణంలోని పాపరాజుతోటకు చెందిన చుండూరి సరస్వతి భ్రమరాంబ సేవా సమితి తరఫున అమ్మవారికి పట్టుచీరపై లలిత సహస్ర నామాలను ఎంబ్రాయిడరీతోగా చేసి సమర్పించారు. గత సంవత్సరం మార్చిలో ప్రారంభించి ఈ ఏడాది జనవరిలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా భ్రమరాంబ సేవా సమితి ప్రతినిధులకు దేవస్థానం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పదోన్నతిపై ఇద్దరు జడ్జీలు నియామకం

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జిగా సయ్యద్ జియావుద్దీన్, సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి గుంటూరు (సీనియర్ డివిజన్)గా మహ్మద్ హిజ్రత్ ఫాతిమాను పదోన్నతిపై నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన జడ్జీల బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాకు వీరిని నియమించారు. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ

తెనాలి టౌన్: ఆంధ్రప్రదేశ్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్/ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.హరినారాయణన్ బుధవారం స్థానిక కొత్తపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో కార్యాలయానికి వచ్చిన హరినారాయణ, ముందుగా రికార్డులను పరిశీలించారు. సబ్‌రిజిస్ట్రార్ బుజ్జిబాబు, సిబ్బందిని రిజిస్ట్రేషన్ల విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సమస్యలపైనా ఆరా తీశారు. దాదాపు రెండు గంటల సేపు తనిఖీ చేశారు. కొత్తగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరు పరిశీలన నిమిత్తం తనిఖీకి వచ్చారు. సాధారణ పరిశీలనలో భాగంగానే వచ్చారని డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ జి.శ్రీనివాసరావు చెప్పారు. తనిఖీల్లో జిల్లా రిజిస్ట్రారు డి.శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాల మేరకు అధికారులు వ్యవహరించాలి

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులు ఈసీ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో ఉదయం ప్రిసైడింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు, మధ్యాహ్నం అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

భూసేకరణపై రణమే!

- రైల్వే లైను కోసం భూసేకరణకు కూటమి సర్కారు ప్రయత్నాలు
- పూలింగ్ చేయాలని మూడు గ్రామాల రైతులు డిమాండ్
- పరిహారం తగ్గించేలా పాలకుల తీరు ఉందంటూ మండిపాటు
- ప్రభుత్వం దిగిరాకుంటే పోరాటం చేస్తామని హెచ్చరిక

రాజధాని అమరావతికి రైలు మార్గం కోసం ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన రైల్వే లైన్‌కు అవసరమైన భూములను తాము సమీకరణకు మాత్రమే ఇస్తామని రైతులు తేల్చిచెప్పారు. కూటమి ప్రభుత్వం తమకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తమ డిమాండ్‌కు దిగిరాకుంటే సర్వేను అడ్డుకుంటామని, న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.





సమావేశానికి హాజరైన రైతులు (ఇన్‌సెట్‌లో) ఆర్డీవోకు తమ సమస్యలను వివరిస్తున్న రైతు

అమరావతి: కూటమి ప్రభుత్వం తీరుపై స్థానిక పర్యాటకశాఖ అతిథిగృహంలో బుధవారం జరిగిన సమావేశంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కర్లపూడి రైతు మంచికలపూడి వీరరాఘవయ్య మాట్లాడుతూ.. గతంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు భూములిచ్చిన వారికి పూలింగ్ పద్ధతిలో రాజధాని అమరావతిలో భూములు కేటాయించారన్నారు. అది కూడా కేంద్రప్రభుత్వ సంస్థ అయినప్పటికీ పూలింగ్ జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం తాము కోరిన విధంగా పూలింగ్ చేయాలన్నారు. అలాగే వైకుంఠపురం భూములలో వెంకటేశ్వరస్వామి భూములకు చాలా రిజిస్ట్రేషన్‌లు జరిగాయని, రైతుల ఆధీనంలో ఉన్న ఆ భూముల పరిహారం ఎవరికిస్తారని పలువురు ప్రశ్నించారు. రాజధాని పరిసర ప్రాంతాలలో భూముల విలువ పెంచకుండా 2021 నాటి విలువల ప్రకారం పరిహారం ఇస్తే తాము నష్టపోతామని రైతులు వాపోయారు. గ్రామసభలు నిర్వహించి రైతులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్న తర్వాతే సర్వే చేయటానికి సహకరిస్తామని తేల్చిచెప్పారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

లిఖితపూర్వకంగా సమాధానాలిస్తాం

సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి మాట్లాడుతూ.. రాజధాని అమరావతికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి ఏపీలోని అమరావతి మీదుగా నంబూరు వరకు రైల్వే లైన్ నిర్మాణానికి నిర్ణయించారన్నారు. మండలంలోని కర్లపూడి, వైకుంఠపురం, ఎండ్రాయి గ్రామాలలో 333.94 ఎకరాలలో భూ సేకరణ చేయాలని గతేడాది నవంబర్ 23వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. ఈ భూసేకరణలో వైకుంఠపురం గ్రామంలో 94 ఎకరాలు, ఎండ్రాయి గ్రామంలో 7.31 ఎకరాలు, కర్లపూడి గ్రామంలో 232.94 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. మూడు గ్రామాల రైతులు నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి భూసేకరణకు విముఖత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం విధివిధానాలు ఉన్నాయన్నారు. ఈ అంశంపై రైతుల అభిప్రాయాలను స్టేట్‌మెంట్ రూపంలో రికార్డు చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. భూసేకరణా? లేదంటే భూ సమీకరణా? అనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అందుకు అనుగుణంగా తాము రైతుల పొలాలను సర్వే చేసి నివేదికలను రూపొందిస్తామన్నారు. రైతులు తమ సందేహాలను లిఖిత పూర్వకంగా అందించాలని కోరారు. తాము కూడా వాటికి లిఖితపూర్వకంగానే సమాధానాలను ఇస్తామన్నారు.

సమీకరణకు మాత్రమే అంగీకారం

సమావేశం అనంతరం రైతులు మాట్లాడుతూ తాము మాత్రం ముమ్మాటికీ ల్యాండ్ పూలింగ్‌కు మాత్రమే భూమి ఇస్తామని స్పష్టం చేశారు. అధికారులు బలవంతంగా సర్వే చేయాలని చూస్తే ప్రతిఘటిస్తామని ఆర్డీవోకు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ డానియేల్, సీఐ అచ్చియ్య, మండల సర్వేయర్ భాగ్యలక్ష్మి, మూడు గ్రామాల నుంచి దాదాపు వంద మంది రైతులు పాల్గొన్నారు.

బాపట్ల నేతలకు అధినేత దిశానిర్దేశం



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులనుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పకడ్బందీ పరీక్షలకు చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

బాపట్ల: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అనుబంధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని జేసీ సూచించారు. మార్చి 17వ తేదీ నుంచి 31 వరకు జరిగే పది పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 103 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు 10 కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటి కోసం రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియమించామన్నారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, ఆరోగ్య సిబ్బంది ఉండాలన్నారు. ఎండల నేపథ్యంలో కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, ప్రాథమిక చికిత్స కిట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులే గాకుండా విధులు నిర్వహించే సిబ్బంది సైతం ఎవరూ సెల్ ఫోన్‌లను పరీక్షా కేంద్రాల్లోకి వెంట తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాలు లీక్ జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూత వేయించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అంతరాయం లేకుండా పరీక్ష కేంద్రాల వద్దకు ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, డీఈఓ పురుషోత్తం, ఇంటర్మీడియట్ బోర్డ్ ఆర్‌ఐఓ యర్రయ్య, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

నిపుణుల సామర్థ్యానికి ప్రతిభే కొలమానం

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్
- హైకోర్టు డిజిగ్నేటెడ్ న్యాయవాది రమణమూర్తికి ఘనసత్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ చలమేశ్వర్

నరసరావుపేట టౌన్: వివిధ వృత్తుల్లో ఉన్న నిపుణుల సామర్థ్యానికి డబ్బు సంపాదన కొలమానం కాదని, వారు చూపే ప్రతిభే కొలమానమని విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది జీఎల్వీ రమణమూర్తి 50 ఏళ్ల వృత్తి జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన సభకు జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన న్యాయవాదులు అంతర్జాతీయ స్థాయిలో పేరు సంపాదించిన వారు చాలామంది ఉన్నారన్నారు. ప్రస్తుతం స్థానిక న్యాయస్థానాలకు, హైకోర్టు కూడా ఉత్తరాది నుంచి న్యాయవాదులను పిలిపిస్తున్నారని అది మంచి పరిణామం కాదన్నారు. స్థానిక న్యాయవాదులను సుప్రీంకోర్టుకు వివిధ రాష్ట్రాల హైకోర్టులకు వాదనలకు తీసుకెళ్లినప్పుడే ఆయా న్యాయవాద అసోసియేషన్ల న్యాయవాదుల కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయన్నారు. జీఎల్వీ రమణమూర్తి జీవితం న్యాయవాదులకు స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయశాస్త్రాన్ని పూర్తిగా ఔపోసన పట్టి వాదనలను క్షుణ్ణంగా, అర్థమయ్యే రీతిలో సరళంగా వివరించాలన్నారు. అనంతరం న్యాయవాది జీఎల్వీ రమణమూర్తిని ఘనంగా సత్కరించారు. గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కపర్ది, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్‌కే నరసింహారావు, న్యాయవాద సంఘం అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు, స్థానిక న్యాయమూర్తులు ఎస్.సత్యశ్రీ, కె.మధుస్వామి, ఆర్.ఆశీర్వాదం పాల్, న్యాయవాది బొడ్డుచర్ల అనీల్‌కుమార్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా జలబిందెల మహోత్సవం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ వారి పెద్ద తిరునాళ్లలో భాగంగా రెండో రోజు బుధవారం జలబిందెల కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక మునేరులో పురోహితులు పూజాది కార్యక్రమాలు నిర్వహించి, ఆచారం ప్రకారం ఐదు వంశాలకు చెందిన కర్ల వెంకటేశ్వర్లు, సూరంపల్లి రామకృష్ణ, వడ్లమూడి ప్రసాద్, నల్లపునేని నితిన్‌చౌదరి, గజ్జి శివకృష్ణ జలబిందెలు తలపై పెట్టుకోగా.. వారికి అమ్మవారి సేవకులు పాపమాంబ వంశీకులు కంకణాలు ధరింపజేశారు.

టీ అండ్ స్నాక్స్.. అంతే!

- తూతూమంత్రంగా యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం
- 14 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు గైర్హాజరు
- ప్రణాళికలు, తీర్మానాలు లేవు
- పలు ముఖ్యశాఖల అధికారులూ డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గోపీ

యద్దనపూడి: తీర్మానాలు లేవు.. అభివృద్ధికి ప్రణాళికలు లేవు. ప్రతి సారీ పాఠం చెప్పినట్టే ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు వినిపించడంతోనే సమావేశాన్ని సరిపెట్టారు. యద్దనపూడిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పులగం రజని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే ఈ సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్‌లు కూడా హాజరుకాలేదు. వాస్తవానికి మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభించాలి. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు ఆలస్యంగా రావడంతో 3.10 గంటలకు ప్రారంభించి, 4.10కి ముగించారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ ఏఈ సురేష్, వైద్యాధికారి శ్రీహర్ష, పంచాయతీరాజ్ ఏఈ ఆనందరావు, వ్యవసాయాధికారి మేరమ్మ, ఆర్ అండ్ బీ ఏఈ బాబ్జి, పోలీస్, రవాణా శాఖాధికారులు గైర్హాజరయ్యారు. ఒకవైపు సర్వసభ్య సమావేశం జరుగుతుండగా కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఈఓఆర్డీ రూంలో కూర్చొని బాతాఖానీ చెప్పుకుంటూ కూర్చోవడం గమనార్హం. కేవలం టీ అండ్ స్నాక్స్‌తో కాలక్షేపం చేస్తూ సమావేశాన్ని ముగించారు. ఒకవైపు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే, అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించటంతోనే సరిపెట్టారు. పథకాల గురించి అధికారులు చెప్పింది వినడమే తప్పా, సమస్యలను పరిష్కరించండి అని అడిగే ప్రజాప్రతినిధి కరువయ్యాడు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్ర'గతి'లేని నివేదికలు

ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్ బి. ప్రకాశరావు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని మౌలిక వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. తహసీల్దారు రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో నాలు గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం పూనూరు గ్రామంలో 5500 ఎకరాలకు రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంఈఓ గోపి మాట్లాడుతూ మండలంలో మోడల్ ప్రైవేటు స్కూల్స్‌ను అవకాశం ఉన్నచోట ఐదుగురు ఉపాధ్యాయులతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని తాగునీటి చెరువులను సాగర్‌జలాలతో నింపేందుకు ముందస్తు ప్రణాళికలు తయారుచేసి, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రావు, ఏపీఓ రమేష్‌బాబు, పశు వైద్యాధికారి శారద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు.

అడ్డు వచ్చిన ఎన్నికల కోడ్?

సర్వసభ్య సమావేశంలో మండలంలో చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తీర్మానాలు, ప్రణాళికలు ఎందుకు చేయడం లేదని ఎంపీడీవో లక్ష్మీనారాయణను 'సాక్షి' వివరణ కోరింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమావేశాన్ని ఇలా ముగించాల్సి వచ్చిందని ఆయన చెప్పడం గమనార్హం.

ట్రాక్టర్‌లో కర్రలు లోడ్ తగిలి యువకుడి మృతి

- మరో యువకుడి పరిస్థితి విషమం
- పోలీసు స్టేషన్ ఎదుట మృతుడి బంధువుల ధర్నా



కొమరాబత్తుని తేజ (ఫైల్)

కొల్లూరు : ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకులకు ట్రాక్టర్‌లో లోడ్ చేసిన కర్రలు తగిలి ఒకరు మృత్యువాత పడగా, మరో యువకుడు తీవ్ర గాయాల బారిన పడిన సంఘటన మండలంలోని తోకలవారి పాలెం–తురకపాలెం గ్రామాల మధ్య మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తోకలవారిపాలెం శివారు తురకపాలేనికి చెందిన కొమరాబత్తుని తేజ (23), స్నేహితుడైన తోకలవారి పాలేనికి చెందిన చిలకా నాగరాజును అతని ఇంటి వద్ద దింపేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా తురకపాలెం వైపు ట్రాక్టర్ కర్రల లోడ్‌తో వెళుతోంది. రాత్రి అవ్వడంతో డ్రైవర్ లైట్లు ఆర్పకుండా వెళ్లడంతో యువకులు ఖాళీ ట్రాక్టర్‌గా భావించారు. కర్రలు లోడ్ కనిపించకపోవడంతో ట్రాక్టర్ పక్కనుంచి వెళ్లారు. ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న కర్రలు ద్విచక్ర వాహనంపై వెళుతున్న తేజ, నాగరాజులకు బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఇద్దరిని 108 వాహనంలో తెనాలి వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు తేజ అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. తీవ్ర గాయాలకు గురైన నాగరాజును గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడు తేజకు ఆరునెలలు కిందటే వివాహం జరిగినట్లు మృతుడి బంధువులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన కొల్లిపర మండలం అన్నవరపులంకకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తోడేటి రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

మృతి చెందిన కొమరామత్తుని తేజ బంధువులు, గ్రామస్తులు కొల్లూరు పోలీసు స్టేషన్ వద్ద బుధవారం మధ్యాహ్నం ధర్నాకు దిగారు. ప్రమాదంపై కేసు నమోదు చేశారోలేదో వెంటనే తేల్చాలని, అదుపులోకి తీసుకున్న డ్రైవర్‌ను చూపించాలని డిమాండ్ చేశారు. ఏఎస్‌ఐ అర్జున్‌ను పలుమార్లు అడిగినా సరైన సమాదానం చెప్పకుండా దాటవేయడంతో, పోలీసుల వ్యవహార శైలిపై తమకు అనుమానాలు ఉన్నాయని తెనాలి–రేపల్లె ప్రధాన రహదారిపై బైఠాయించారు. సుమారు రెండు గంటలపాటు ఆందోళన చేశారు. కేసు నమోదు చేశామని, డ్రైవర్ తమ అదుపులోనే ఉన్నాడని వేమూరు సీఐ పి.వి. ఆంజనేయులు, కొల్లూరు ఎస్‌ఐ జి. ఏడుకొండలు సర్ది చెప్పి ఆందోళనను విరమింపజేయడానికి ప్రయత్నించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో అది తమ పరిధిలోని వ్యవహారం కాదని సీఐ తేల్చి చెప్పారు. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించడంతో ధర్నాను విరమించారు.



ఆందోళన చేస్తున్న తురకపాలెం వాసులు, మృతుడి బంధువులు

క్లుప్తంగా

జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారిగా శ్రీనివాసన్



చెరుకుపల్లి: జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారిగా బుధవారం చెరుకుపల్లి మండల ఈఓపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. పంచాయతీ అధికారులు కూడా సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులతో మమేకమై ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభానితో పాటు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఈవూరి విజయ్ బాబు, మురళి, సురేష్ పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి



నార్నెపాడు(ముప్పాళ్ళ): రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలనిజాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను బుధవారం పరిశీలించారు. భూమి యజమానికి ముందుగానే సమాచారం అందిస్తున్నారా..లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అందరి సమక్షంలోనే రీసర్వే పక్కాగా నిర్వహిస్తున్నారని రైతులు తెలిపారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని ఆరా తీశారు. గ్రామ స్థాయిలో రైతులందరికీ పేర్లు, ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశామని, గ్రామంలో చాటింపు, మైకు ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని, ఏయే ప్రాంతాల్లో సర్వే జరుగుతుందో ఆయా రైతులకు గ్రూపుల్లోను, వ్యక్తిగతంగాను, లిఖిత పూర్వకంగా సమాచారం, వాయిస్ సందేశం పంపిస్తున్నామని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ వివరించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ తనిఖీ చేశారు. డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టి.సుధాకర్ తదతరులు ఉన్నారు.

ఇసుక సక్రమ సరఫరాకు చర్యలు తీసుకోవాలి

లక్ష్మీపురం: జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెల 6వ తేదీతో ఇసుక తవ్వకాలకు అనుమతులు ముగిసిన గుండెమెడ, మున్నంగి, బొమ్మువానిపాలెం 14, 15 రీచ్‌లలో నిల్వ ఉన్న 39,529 మెట్రిక్ టన్నుల ఇసుకను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రజలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్సీ కాలనీని ముంచెత్తిన సాగర్ నీరు



ఎండుగుంపాలెం ఎస్సీ కాలనీలో ఇళ్లను ముంచెత్తిన సాగర్ నీరు



గండి పడిన కాలువ కట్ట

నాదెండ్ల: ఎన్ఎస్‌పీ కాలువ కట్ట తెగి ఎండుగుంపాలెం ఎస్సీ కాలనీ ముంపునకు గురైన ఘటన బుధవారం జరిగింది. కొద్దిరోజులుగా ఎన్ఎస్‌పీ కాలువల ద్వారా వ్యవసాయ ఆరుతడుల కోసం సాగర్ నీరు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఎండుగుంపాలెం వద్ద కట్ట బలహీనంగా ఉండటం, గేదెలు రోజూ కాలువలోకి దిగుతూ, ఎక్కుతూ ఉండటం వల్ల కట్ట కోతకు గురైంది. దీనికి తోడు ఎలుకలు కన్నాలు వేయటంతో కట్ట మరింత బలహీనపడింది. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో కట్ట తెగి నీరు సమీపంలోని ఎస్సీ కాలనీని ముంచెత్తింది. పలు ఇళ్లు నీటితో జలమయమయ్యాయి. రోడ్లపై నీరు పారింది. గ్రామస్తుల సహకారంతో పంచాయతీ కార్యదర్శి అహమ్మద్, సిబ్బంది కాలువ గట్టుకు మరమ్మతులు చేశారు. దీనిపై ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించకపోవటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా నీరు విడుదల చేసే సమయంలో కాలువ గట్లను పటిష్ట పరచాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవటం లేదని మండిపడుతున్నారు.

కోటప్పకొండ శివరాత్రి ఉత్సవాలపై మంత్రి సమీక్ష

సాక్షి, అమరావతి: కోటప్పకొండ మహా శివరాత్రి మహోత్సవాలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. సమావేశంలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండటం వల్ల కోటప్పకొండలో భౌతికంగా సమావేశం నిర్వహించకుండా, సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణపార్కింగ్, తాగునీటి సదుపాయాలు, వైద్య సహాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అదనపు పోలీసు బలగాలను మోహరించి, భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలన్నారు.

సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ



ర్యాంకర్లతో అన్నా నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఈ నెల 11వ తేదీన ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ప్రతిభ చాటారని శ్రీమేధ విద్యా సంస్థల చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. బుధవారం గుంటూరు కొత్తపేటలోని శ్రీమేధ కార్యాలయంలో విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ... గత 20 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 450కుపైగా ఆలిండియా ర్యాంకులు సాధించామని చెప్పారు. సీఎంఏ ఫైనల్‌లో షేక్ మొహమ్మద్ అలీ 800 మార్కులకు గాను 553 మార్కులతో జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. సీఎంఏ ఇంటర్ విభాగంలో కె. యోగితారెడ్డి 800 మార్కులకు గాను 561 మార్కులతో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు కైవసం చేసుకోగా, జి.రామ్‌చరణ్ తేజ 442 మార్కులు, డి. వెంకటరామిరెడ్డి 437, ఎం.మోక్షిత 431, జి.స్వాతి 430 వంటి టాప్ మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ విజయాన్ని సాధించేందుకు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సహకారం ఎంతగానో ఉందన్నారు. సీఎంఏ ఇంటర్ పూర్తైతే విద్యార్థులకు ఐసీఎంఏఐ సంస్థ నెలకు రూ.25 వేలు ఇంటర్న్‌షిప్‌తో మంచి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మొహమ్మద్ అలీకి రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. అనంతరం టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అన్నా నందకిషోర్, డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

16న జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న విజయ భాస్కరరావు

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన జిల్లాస్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు అధ్యక్షులు విజయ భాస్కరరావు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని జిమ్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... గుంటూరు జిల్లా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ (మెన్, ఉమెన్) పోటీలు ఉంటాయని అన్నారు. గుమ్మడి పుల్లేశ్వరరావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు నగర పరిధిలోని వైష్ణవి కల్యాణ మండపం వేదికని చెప్పారు. క్రీడాకారులు 16న ఉదయం 7 గంటలలోపు బాడీ వెయిటింగ్‌కు హాజరుకావాలని కోరారు. వయసు ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన వ్యాపారి ఆత్మహత్య



సంతమాగులూరు(అద్దంకి రూరల్): అప్పుల బాధతో మనస్తాపానికి గురైన విత్తనాల వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు ఎన్ఎస్‌పీ కాలువ గట్టుపై చోటు చేసుకుంది. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ పట్టాభిరామయ్య కేసు నమోదు చేశారు. అద్దంకి పట్టణంలోని పసుమర్తిపాలేనికి చెందిన సిద్దారపు నాగిరెడ్డి (50) విత్తనాల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చలేనని మనస్తాపానికి గురై బుధవారం ఉదయం సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు ఎన్నెస్పీ కాలువ వెంబడి గట్టు వద్దకు చేరుకున్నాడు. అక్కడ కూల్ డ్రింక్‌లో పురుగుల మందు తాగి మృతి చెందాడు.

కాంప్లెక్స్ సమావేశం నిర్వహిస్తే సెలవు ఇవ్వాలి

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఏర్పాటు చేసిన ప్రతినెలా 3వ శనివారం పూర్తిగా సెలవు ప్రకటించాలని ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెజ్జం సంపత్‌బాబు, కొమ్ము కిషోర్, గౌరవ అధ్యక్షుడు పమ్మి వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతినెల 3వ శనివారం కాంప్లెక్స్ సమావేశాలు ఏర్పాటు చేసినట్టు పాఠశాల విద్య డైరెక్టర్ ప్రకటించారనీ, అయితే ఆ రోజు మెడికల్ లీవ్ మినహా మిగిలిన సెలవులను వినియోగించుకోరాదని నిబంధన విధించటం సరికాదని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని కోరారు. ఈనెల 3వ శనివారం పలు శుభ కార్యాలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ముందుగానే నిర్ణయించుకున్నారనీ, ఇప్పటికిప్పుడు ఇటువంటి ప్రకటన వెలువడటంతో గందరగోళం నెలకొన్నదని తెలిపారు. అధికారులు స్పందించి కాంప్లెక్స్ రోజున సాధారణ సెలవులు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 138, తూర్పు కెనాల్‌కు 320, పశ్చిమ కెనాల్‌కు 150, నిజాంపట్నం కాలువకు 120, కొమ్మమూరు కాలువకు 469 క్యూసెక్కులు విడుదల చేశారు.

ట్రైనీ జడ్జీలకు జీజీహెచ్‌లో శిక్షణ



ట్రైనీ జడ్జీలతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ

గుంటూరు మెడికల్: జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 60 మంది ట్రైనీ జూనియర్ సివిల్ జడ్జీలు బుధవారం శిక్షణ నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. రోడ్డు ప్రమాదాలు, వివిధ రకాల మెడికో లీగల్ కేసులకు సంబంధించి శిక్షణ నిమిత్తం వచ్చిన వారికి పలువురు వైద్యులు శిక్షణ ఇచ్చారు. ట్రామా, ఎమర్జెన్సీ విభాగంలో యాక్సిడెంట్, ట్రామాకి సంబంధించిన కేసులపై ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధికా రాణి వారికి పలు అంశాలు వివరించారు. ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య కూడా యాక్సిడెంట్, ఘర్షణలు, దాడి వంటి ఎముకలకు సంబంధించిన మెడికో లీగల్ కేసుల గురించి వివరించారు. మెడికల్ రికార్డు ఆఫీసర్ కందుల రామారావు మాట్లాడుతూ మెడికో లీగల్ కేసు, నాన్ మెడికో లీగల్ కేసులకు సంబంధించి రికార్డులు భద్రపరిచే విధానాలను తెలిపారు. పోస్ట్‌మార్టం చేసే ప్రక్రియలను, దానికి సంబంధించిన న్యాయపరమైన అంశాలను ఫోరెన్సిక్ నిపుణులు డాక్టర్ జాఫర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, వైద్యులు, జ్యుడీషియల్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

యువతకు సువర్ణ అవకాశం

లక్ష్మీపురం: ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జేసీ ఎ. భార్గవ్ తేజ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర - గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. దీనిపై సమీక్షలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా యువత చదువుతూ సామాజిక సేవ చేసే అవకాశం రావడం మంచి పరిణామం అన్నారు. వ్యవసాయ, నాబార్డ్, లీడ్ బ్యాంకు, ఆరోగ్య, డీఆర్డీఏ డిపార్టుమెంట్లను ముందుగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ అయ్యి కనీసం 20 మంది యువతకు 120 గంటలపాటు ఈ ప్రోగ్రాం అందుబాటులోకి తీసుకు రావాలని తెలిపారు.

కష్టార్జితం బూడిద పాలు

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



ఎగిసిపడుతున్న మంటలు

కారంచేడు: పూరిగుడిసె అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని ఆదిపూడిలో బుధవారం జరిగింది. కష్టార్జితం కాలి బూడిదవ్వడంతో మహిళ వేదన వర్ణనాతీతంగా మారింది. మండలంలోని ఆదిపూడి గ్రామానికి చెందిన మిరియాల శివమ్మ తల్లితో కలిసి గ్రామంలోని శివాలయం రోడ్డులో పూరి గుడెసె వేసుకొని జీవనం సాగిస్తోంది. వృత్తి రీత్యా బట్టలు ఉతకడంతో పాటు, ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులు చేస్తుంది. చిరకాల కోరికగా ఉన్న సొంతింటి నిర్మాణం కోసం రూపాయి, రూపాయి పోగేసుకుంటోంది. బుధవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో పూరి గుడెసెకు మంటలు వ్యాపించాయి. దీనికి తోడు గ్యాస్ సిలిండర్ కూడా పేలిపోవడంతో మంటల తీవ్రంగా వ్యాపించాయి. స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. విషయం తెలుసుకున్న శివమ్మ ఇంటికి చేరుకుంది. ఇంటి నిర్మాణం కోసం దాచుకుంటున్న రూ. 50 వేలతో పాటు ఐదు సవర్ల బంగారు ఆభరణాలు, కొన్ని విలువైన పత్రాలు, ఇంటి సామగ్రి, బట్టలు సైతం పూర్తిగా కాలిపోయాయని బాధితురాలు వాపోయింది. ఆస్తి విలువ సుమారు రూ. 4లక్షలకు పైగా ఉంటుందని, తన ఇంటి నిర్మాణం ప్రభుత్వమే చేపట్టాలని అభ్యర్థించింది. రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలాన్ని సందర్శించి నష్టం అంచనా వేశారు.

జేఈఈ మెయిన్‌లో విజ్ఞాన్ విద్యార్థుల సత్తా



ర్యాంకర్లను అభినందిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: జేఈఈ మెయిన్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని ఇంటర్ కళాశాలలో మంగళవారం ర్యాంకుల సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన వై.విష్ణు కార్తీక్ (99.45 పర్సంటైల్), ఆర్. శ్రీకాంత్ (98.38), కె విష్ణువర్ధన్ (96.78), ఎస్.ప్రేమ్ కుమార్ (96.33), ఎస్‌డీ అర్షాద్ (96.29), బాషా (96.13), ఉమేష్ నారాయణ్ (95.92), వి.కౌశిక్ (93.47), గౌతం రెడ్డి (93.28), నాగ జస్వంత్ (91.18), అవినాష్ (91.08), ఉమేష్ చౌదరి (90.50), రిక్శిత్ (90.03) ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. కళాశాలకు చెందిన 25 శాతం మంది విద్యార్థులు 90 శాతానికిపైగా పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ జె.మోహన్ రావు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ఫైనల్‌కు కేరళ, కర్ణాటక క్రికెట్ జట్లు



కేరళ, తమిళనాడు జట్లు

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్-2025 మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. బుధవారం తమిళనాడు, కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ గెలిచింది. ఆంధ్ర తెలంగాణ, కర్నాటక మధ్య మ్యాచ్‌లో కర్నాటక విజయం సాధించింది. కేరళ, కర్నాటక ఫైనల్‌కు చేరాయి.

- తమిళనాడు, కేరళ మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన తమిళనాడు 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 172 పరుగులు చేసింది. వేదాంత భరద్వాజ్ 56 బంతులలో 81 పరుగులు చేశాడు. అనంతరం 17.4 ఓవర్లతో కేరళ లక్ష్యాన్ని ఛేదించింది. సచిన్ సురేష్ 39 బంతులలో 62 పరుగులు, ఎంఎస్ అఖిల్ 28 బంతులలో 55 పరుగులు చేశారు.
- ఆంధ్ర తెలంగాణ, కర్నాటక మ్యాచ్‌లో తొలుత ఆంధ్ర తెలంగాణ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 145 పరుగులు చేసింది. ఎస్.తరుణ్ 28 బంతులలో 36 పరుగులు చేశాడు. కర్నాటక బౌలర్లు ఏఎం కిరణ్ 4 ఓవర్లలో 28 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీయగా, అర్జున్ గౌడ్ 38 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నాటక 15 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. జె. సుజిత్ 38 బంతులలో 64 పరుగులు చేశాడు. కేరళ, కర్నాటకలు గురువారం ఉదయం 9.30 గంటలకు ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నాయి.

గుంటూరు రైల్వే డివిజన్‌లో జీఎం తనిఖీలు


లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ గుంటూరు డివిజన్‌లోని గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌ను బుధవారం తనిఖీ చేశారు. డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణ తదితరులు ఆయన వెంట ఉన్నారు. ముందుగా జీఎం ప్రయాణికులకు సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి వాటిని పరిశీలించారు. సిబ్బంది బుకింగ్ లాబీ, రన్నింగ్ రూమ్, ఆహార నాణ్యత గురించి తెలుసుకున్నారు. రన్నింగ్ రూమ్‌లలో ఉండే సమయంలో సౌకర్యాలపై లోకో పైలట్లు, గార్డులతో మాట్లాడారు. ఉమెన్ రన్నింగ్ రూమ్‌ను కూడా ఆయన పరిశీలించారు. తర్వాత నల్లపాడు రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. నల్లపాడు - పిడుగురాళ్ల సెక్షన్ మధ్య తనిఖీ చేశారు. కృష్ణానదిపై ప్రధాన వంతెనను పరిశీలించి, నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు.

డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు కేటాయింపు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి - కాకినాడ టౌన్, చర్లపల్లి - నరసాపూర్ వారాంతపు ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం తెలిపారు. వివరాలివీ..

- నంబర్ 07031 రైలును చర్లపల్లి - కాకినాడ టౌన్‌కు ఈ నెల 14, 21వ తేదీలలో నడపనున్నారు. చర్లపల్లి నుంచి ఆయా తేదీల్లో సాయంత్రం 7.20 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు కాకినాడ టౌన్ స్టేషన్‌కు చేరుకుంటుంది.
- నంబరు 07032 రైలు కాకినాడ టౌన్ - చర్లపల్లికు ఈ నెల 16, 23వ తేదీలలో నడపనున్నారు. కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి సాయంత్రం 6.55 గంటలకు బయలు దేరి చర్లపల్లి స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌ల మీదుగా ఈ రైలు ప్రయాణిస్తుంది.
- నంబర్ 07233 రైలు చర్లపల్లి -నరసాపూర్‌కు ఈ నెల 14 ,21వ తేదీలలో నడపనున్నారు. చర్లపల్లి స్టేషన్ నుంచి సాయంత్రం 7.15 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 5.50 గంటలకు నరసాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుంది.
- నంబర్ 07234 రైలు నరసాపూర్-చర్లపల్లికి ఈ నెల 16, 23వ తేదీలలో నడపనున్నారు. ఈ రైలు నరసాపూర్ స్టేషన్ నుంచి రాత్రి 8 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుంది.

డాక్టర్లకు క్రికెట్ పోటీలు ప్రారంభం



పెదకాకాని: వైద్య సేవలో నిత్యం సవాళ్లు ఎదుర్కొనే వైద్యులకు ఉపశమనం కలిగించేలా డాక్టర్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ క్రికెట్ పోటీలను ప్రారంభించడం సంతోషంగా ఉందని ఐజీ ఈగల్ ఆకే రవికృష్ణ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న క్రికెట్ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉమ్మడి జిల్లాల డాక్టర్ల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు టీమ్‌లను ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ భాస్కరరావు అభినందించారు. ఆకే రవికృష్ణ మాట్లాడుతూ.. వైద్యులకు పునరుత్తేజం కలిగేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టీసీ రెడ్డి, డాక్టర్ ఆవుల శ్రీనివాసరావులను అభినందించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సందీప్ వెల్ల, డాక్టర్ శ్రీనివాసరెడ్డి దాట్ల, డాక్టర్ జాన్ షహీద్, డాక్టర్ ఎండీ అసలం, డాక్టర్ ప్రదీప్ కుమార్ అంగడి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు జనసేన సమావేశాలు

సాక్షి, అమరావతి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఈ నెల 16, 17 తేదీల్లో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో జనసేన శ్రేణులతో సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్టు పేర్కొంది.